క్లుప్తంగా

మావుళ్లమ్మకు విరాళాలు



మావుళ్లమ్మకు వెండి శంఖం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్లమ్మకు భీమవరం వాసి మద్దిరాల ఈశ్వర శ్రీ హర్ష అమ్మవారి అభిషేకానికి 400 గ్రాముల వెండి శంఖం అందజేశారు. వీరికి ఆలయ అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. అదే విధంగా చెన్నైకు చెందిన జకామశా శాస్త్రి ఘనాపాఠి, భారతి దంపతులు అమ్మవారికి బంగారు చీర నిమిత్తం రూ.11వేలు అందజేశారు. అర్చకుడు కొడమంచిలి కొప్పేశ్వర రావు పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ దాతలకు శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

కొల్లేరు ఉప్పు చేప.. రుచి అమోఘం



కొల్లేరు తీర గ్రామంలో ఎండ బెట్టిన ఉప్పు చేపలు

ఆకివీడు: సముద్రపు చేపల్ని ఎండబెట్టి ఉప్పు చేపలుగా విక్రయిస్తారు. ఆ చేపల రుచే వేరని పలువురు గుటకలేస్తారు. అయితే కొల్లేరు తీరంలో పడిన చేపల్ని ఎండబెట్టి ఉప్పు చేపలుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. సముద్రపు ఉప్పు చేప కన్నా రుచిలో తామేమీ తక్కువ కాదన్నట్లుగా కొల్లేరు ఉప్పుచేప పోటీ పడుతోంది. కొల్లేరు సరస్సులోనూ, తీర ప్రాంతంలో లభించిన కట్టిపరిగి, జెల్ల, గొరక, పండుగప్ప, కొరమేను, మట్టగిడస, ఇంగిలాయ్, వివిధ రకాల చిన్న చేపల్ని ఎండబెట్టి ఉప్పు చేపలుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. ఉప్పు చేపలు మహారుచిగా ఉంటున్నాయని భోజన ప్రియులు చెబుతున్నారు. కొల్లేరు తీరంలోనూ, కాలువల్లో ప్రసిద్ధి చెందిన శాక రొయ్యని కూడా ఎండు రొయ్యగా తయారు చేసి విక్రయిస్తున్నారు. కొల్లేరు తీర గ్రామాల్లోని మహిళలు, వృద్ధులు ఎండు చేపల విక్రయాల్లో పాల్గొంటూ కుటుంబ ఆదాయానికి తోడ్పడుతున్నారు.

ఘనంగా యోగా డే ర్యాలీ



యోగా డే ర్యాలీని ప్రారంభిస్తున్న పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగా డేను పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం ఉదయం ఘనంగా ర్యాలీని నిర్వహించారు. యోగా డేను మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించేందుకు వీలుగా మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రజలను ఆహ్వానించేందుకుగానూ ఆదివారం 150 మంది సభ్యులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. బాబా రామ్‌దేవ్ ఆదేశానుసారం భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా శాఖ ఇన్‌చార్జి, ఆరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడే యోగ గురువు కరిబండి రామకృష్ణ సారథ్యంలో బైక్ ర్యాలీ పట్టణంలోని ప్రముఖ కూడళ్లలో, ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి టూ టౌన్‌లోని రేలంగి థియేటర్ సర్కిల్ అక్కడ నుంచి ఎస్వీ రంగారావు విగ్రహం సెంటర్ వరకు నిర్వహించారు. తొలుత పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రారంభించారు. న్యాయవాది మాకా శ్రీనివాస్, అపర్ణ ప్రసాద్, యోగ గురువులు ఐ.మాధవరావు, బి.చంద్రశేఖర్, సీహెచ్ అంబిక, సుభద్ర, నూకరాజు, యోగ బృంద సభ్యులు పర్యవేక్షించారు. కరిబండి రామకృష్ణ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ యోగా డే 10 సంవత్సరాలు క్రితం ప్రారంభించారన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని వివరించారు.

ముగిసిన నేత్రాలమ్మ ఉత్సవాలు

పెంటపాడు: గత నెల రోజుల నుంచి నిర్వహిస్తున్న దర్శిపర్రు గ్రామ దేవత నేత్రాలమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామంలో భారీ సేవ, నైవేద్యాల కార్యక్రమాలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విందు కోసం వచ్చిన బంధువుల రాకతో గ్రామం కిక్కిరిసింది. ప్రతి వీధి కార్లు, మోటార్‌సైకిళ్లు, ప్రజలతో నిండిపోయింది. సర్పంచ్ కోలా శేషవేణి, ఎంపీపీ దాసరి హైమావతి పాల్గొన్నారు.

మొదటి గురువు నాన్న

తణుకు టౌన్: జీవిత పాఠాలు నేర్పే నాన్న బిడ్డకు మొదటి గురువని సాహితీ సామ్రాజ్యం సాహితీ సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కర రావు అన్నారు. తణుకులో అంతర్జాతీయ తండ్రుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుటుంబంలో తండ్రి స్థానం, పిల్లలపై తండ్రి ప్రభావం గురించి వివరించారు. తణుకు కేర్ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కోనా భార్గవ్, వ్యాపారవేత్త షర్మిష్ఠ వీరన్న, బీ.శ్రీనివాస్‌లను సత్కరించారు. కార్యక్రమంలో 'నాన్న నేనున్నా' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కేర్ ఆసుపత్రి సిబ్బంది, దిర్సిపో మధుబాబు పాల్గొన్నారు.

విత్తనాలు సిద్ధం.. సాగుకు సన్నద్ధం

- తొలకరి ఖరీఫ్ పనుల ప్రారంభం
- విత్తన శుద్ధిపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారుల సూచన



దిరుసుమర్రు గ్రామంలో నారుమడులను సిద్ధం చేస్తున్న రైతు

భీమవరం అర్బన్ : తొలకరి వానలు మొదలయ్యాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ముందస్తు ఖరీఫ్ సాగు కోసం ఈ నెల 1న పంట కాలువలకు సాగునీరు విడుదల చేశారు. ప్రధాన కాలువల నుంచి పిల్ల కాలువలకు నీరు చేరడంతో చేలల్లో నీటిని నింపి రైతులు నారుమడులను తయారు చేస్తున్నారు. భీమవరం మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, చినఅమిరం, రాయలం, కొవ్వాడ అన్నవరం తదితర గ్రామాలలో సుమారు 8 వేల ఎకరాలలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాలు, డీసీఎమ్ఎస్‌లలో అందుబాటులో ఉంచింది. దీంతో అన్నదాతలు సాగుకు సన్నద్ధమై నారుమడుల పనులు ముమ్మరం చేశారు. జులైలో రెండు లేదా మూడో వారం నుంచి వరినాట్లు వేయనున్నారు.

నారుమడి తయారీ

నారుమడి తయారు చేసుకోవడానికి వినియోగించే భూమిలో చివరి దుక్కులో ఐదు సెంట్ల భూమికి రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్, కిలో పొటాషియమ్ చల్లాలి. ఆకు మడిలో ముంపు నీరు దిగేందుకు చిన్న చిన్న బోదెలు, ఆకుమడి చుట్టూ ఏర్పాటు చేసుకోవాలి. నారుమడిలో విత్తనాలు చల్లుకున్న తర్వాత మొదటి ఆకు విచ్చుకునే వరకు 10 రోజులు ఆరుతడి యాజమాన్యం నిర్వహించాలి. 11వ రోజు మొదటి ఆకు విచ్చుకున్నాక నారుమడిలో నీరు ఉండేటట్లు చూసుకోవాలి. ఇలా నారుమడి వేసిన 21–25 రోజుల్లో నాణ్యమైన నారు తయారవుతుంది.

విత్తన శుద్ధితో నాణ్యమైన నారు

విత్తనం కొన్న వెంటనే 100 గింజలను మొలక పరీక్ష చేసి 80 శాతం మొలక వచ్చిన విత్తనాలనే వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అలాగే విత్తన శుద్ధితో నాణ్యమైన నారు లభిస్తుంది. పొడి శుద్ధి విధానంలో కిలో విత్తనాలకు మూడు గ్రాముల చొప్పున కార్బన్డిజం మందు విత్తనాల సంచిలో వేసి మూతి బిగించి బాగా కలిపి 24 గంటలు నిల్వ ఉంచాలి. ఆ తర్వాత వాటిని నానబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. తడి విత్తన శుద్ధి విధానంలో కిలో విత్తనాలకు ఒక గ్రాము కార్బన్డిజం, ఒక లీటర్ నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టి మరో 24 గంటలు మండి కట్టి వాటిని నారుమడిలో చల్లుకోవాలి.

ఎకరాకు 20 నుంచి 30 కేజీల విత్తనాలు

ఒక ఎకరాకు చాలినంత నారు కావాలంటే 20 నుంచి 30 కేజీల వరి విత్తనాలు అవసరమవుతాయి. సాధారణంగా ఖరీఫ్ సాగుకు ఎమ్‌టీయూ 1061, ఎమ్‌టీయూ 1064, ఎమ్‌టీయూ 1318, సంపద స్వర్ణ రకాలు అనుకూలమని వ్యవసాయధికారులు చెబుతున్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు



ఈ ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోను, కొన్ని ప్రైవేట్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. విత్తన శుద్ధి చేస్తే నాణ్యమైన నారు రావడమే కాకుండా దిగుబడి బాగా వస్తుంది. ఎకరాకు సరిపడా నారి కావాలంటే 20 నుంచి 30 కేజీల విత్తనాలు అవసరమువుతాయి. విత్తన శుద్ధి తరువాతే నారుమడులు వేయాలి. నారుమడి తయారు చేసేటప్పుడు విత్తనాల సంచిని, ట్యాగ్‌ను, రశీదును జాగ్రత్తగా ఉంచుకోవాలి.

– నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక కిరాణా మర్చంట్ భవనంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థినీ, విద్యార్థులకు సుమారు 500 మందికి పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమన్విత, కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ, పరుచూరి నాగేశ్వరరావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు పూసరపు గుప్త పాల్గొన్నారు.

నేడు వైద్య పరీక్ష శిబిరం

ఉండి: కూనపరాజు అప్పలరాజు, సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో సోమవారం రొమ్ము క్యాన్సర్ పరీక్ష శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. విజయవాడ మణిపాల్ హాస్పిటల్ సౌజన్యంతో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు ప్రారంభిస్తారన్నారు. అనంతరం పేదలకు నూతన వస్త్రాల పంపిణీ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

కరాటే శిక్షణ శిబిరం ముగింపు



కరాటే శిక్షణ తీసుకున్న చిన్నారులతో నిర్వాహకులు

భీమవరం: డాక్టర్ బీవీ.రాజు వీరమ్మ పార్క్ కాంపౌండ్‌లో చిన్నారులకు కియో జపాన్ షోటోకాన్ కరాటే ఇనిస్టిట్యూట్‌చే ఉచిత కరాటే శిక్షణ నిర్వహించారు. కరాటే శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షణ తీసుకున్న బాల బాలికలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర పీసీసీ సభ్యుడు, సీనియర్ బాడీ బిల్డర్ అద్దంకి దొరబాబు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా కరాటేలో అనేక మందికి శిక్షణ ఇస్తూ, వేసవి సెలవుల్లో క్రీడల వైపు పిల్లలకు ఆసక్తి కలిగించడానికి ఆటపాటలతో పాటు కరాటే లాంటి క్రీడల్లో శిక్షణ ఇప్పించాలన్నారు. నెలరోజులుగా కరాటే ఉచిత శిక్షణ ఇచ్చిన కోచ్ కరణం రాముని అభినందించారు. బాల్యం నుంచి పిల్లలకు విద్యతో పాటు తల్లిదండ్రులు క్రీడల పట్ల ఆసక్తి కల్పించాలని, ముఖ్యంగా బాలికలు కరాటే శిక్షణ తీసుకోవడంద్వారా ఆత్మ రక్షణకు దోహదపడుతుందన్నారు. భీమవరంలో 50ఏళ్లకు పైగా కరాటేలో ఎంతో మందికి శిక్షణ ఇచ్చిన కరాటే వెంకట్ మాస్టర్‌ను సత్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కరాటే కోచ్ కరణం రాము, వెంకట్ మాస్టర్, పుచ్చకాయల రత్నరాజు, కొత్ర శ్రీనివాస్, సుంకర సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు

ఉండి: అంతర్జాతీయ ఫాదర్స్‌డే వేడుకలను ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ పురుష సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ సీఆర్ పీ.కరుణాకర్ ప్రారంభ ప్రార్థనతో నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం సంబరంలా సాగింది. స్థానిక చర్చ్‌లో ఏడుగురు వృద్ధులను ఫాదర్స్ డే సందర్భంగా పురుష సమాజ, చర్చ్ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ప్రముఖ అంతర్జాతీయ ప్రసంగీకుడు రెవరెండ్ యం.జోసఫ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ మగవారు తమ జీవితాన్ని ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు.యువకుడిగా ఉన్నప్పుడే మంచి చదవు, ఉద్యోగం, సమాజం పట్ల భాధ్యత కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు లోను కాకూడదన్నారు. తండ్రిగా భాధ్యత కలినప్పుడు మరింత ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. నీతి, నిజాయితీతోను, భక్తితోను జీవిస్తే భావితరాలు అద్భుతంగా ఉంటాయన్నారు. పురుషులు ఒకరికి ఆదర్శంగా బ్రతకాలే తప్ప తప్పుదారిలో జీవిస్తే దాని ప్రతిఫలం కుటుంబం పడుతుందని తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పురుష సమాజ కమిటీ, చర్చ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్‌లో ఫాదర్స్‌డే వేడుకల్లో వృద్ధులను సత్కరిస్తున్న చర్చ్ ప్రతినిధులు



చర్చ్‌లో ఫాదర్స్‌డే వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

వీజేఎఫ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



వాసవి జాగృతి క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకార దృశ్యం

భీమవరం: వాసవి జాగృతి (వీజేఎఫ్) క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం భీమవరం ప్యాడి–రైస్ మర్చంట్ భవనంలో ఆదివారం నిర్వహించారు. క్లబ్ ఫౌండర్ ప్రెసిడెంట్ తిరివీధి వేణుగోపాల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవి జాగృతి (వీజేఎఫ్) భీమవరం క్లబ్ అధ్యక్షుడిగా పత్రిపాటి బీవీఎస్ఎన్ గుప్త (పత్రిపాటి శ్రీను), కార్యదర్శిగా సబ్బిశెట్టి శ్రీనివాస్ గణేష్, కోశాధికారిగా సంకా అనంత గోపాలం (సంకా గోపి) నియమితులయ్యారు. ఈ సందర్భంగా తిరివీధి వేణుగోపాల్ మాట్లాడుతూ వాసవి జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో కుల మతాలకతీతంగా ఆర్థిక ఇబ్బందులతో ఉన్న పేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తూ, శాంతి, సహనం, స్నేహం వంటి ఆశయాలతో ముందుకు సాగుతుందని, క్లబ్ విధి విధానాలను తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన క్లబ్ అధ్యక్షుడు పత్రిపాటి శ్రీను మాట్లాడుతూ నూతన సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నాగసూరి మురళీమోహన్‌రావు, పువ్వాడ మూర్తి, ఉప్పల మూర్తి, కొల్లిపర పాపారావు, సమయమంతుల నాని, నూలి ప్రసాద్, సూర్య వరపు వెంకటేశ్వరరావు డీవీఎస్. చంద్ర, అల్లు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో ఫాదర్స్ డే



శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమంలో ఫాదర్స్ డే నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బిడ్డల ఉన్నతి కోరుకునే నిస్వార్థ సేవకు నిలువెత్తు సాక్ష్యం నాన్న అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమంలో ఆదివారం ఫాదర్స్ డేను నిర్వహించారు. తండ్రులకు పాద పూజ, సత్కారం చేశారు. ఆశ్రమ యోగ గురువు కరిబండి రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ అంజనేయరాజు, తదితరులు మాట్లాడుతూ చిన్నతనంలో నాన్న చేయి పట్టుకుని ఈ ప్రపంచాన్ని చూపించారని, పెద్దయిన పిల్లలు నేడు నాన్న ఉన్నంత కాలం నేనున్నాను అనే భరోసా తండ్రికి ఇవ్వాలన్నారు.


ఆహా ఏమి రుచి.. 'భీమవరం' విందు



భీమవరంలో 152 రకాల వంటకాలతో ఏర్పాటు చేసిన విందు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి.. రోజు తిన్నా మరి.. భీమవరం విందు వేరు మరి.. అనుకున్నారు కేరళ వాస్తవ్యులు. కేరళకు చెందిన రికేష్ శర్మ భీమవరంలో జరిగిన జేసీఐ ఇంటర్నేషనల్ సమావేశానికి విచ్చేశారు.. ఇంకేముంది భీమవరం అంటేనే మర్యాదలకు, ఆతిథ్యాలకు పుట్టినిల్లు సుమారు 152 రకాల వంటకాలతో భీమవరం రుచులను చూపించారు. పట్టణానికి చెందిన పేరిచర్ల కృష్ణంరాజు జేపీ రోడ్డులో సుమారు 152 రకాల వంటకాలతో ఆహా ఏమి రుచి అన్నట్లుగా స్వీట్స్, హాట్స్, వెజ్ అండ్ నాన్‌వెజ్ బిర్యానిలు, ఫ్రూట్స్, పచ్చళ్లు మరెన్నో వంటకాలతో భీమవరం రుచులు చూపించారు. వంటకాలు చూసిన రికేష్ శర్మ ఆశ్చర్యానికి గురయ్యారు. ఇన్ని రకాల వంటకాలను ఒకే చోట చూడటం ఇదే మొదటి సారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, తదితరులు ఉన్నారు.

'నై'రుతి పవనాలు



ఆకివీడులో దట్టమైన మేఘాలు



మేఘావృతమైన ఆకాశం

ఇలా వచ్చి.. అలా వెళ్లిపోతున్న మేఘాలు

ఆకివీడు: నైరుతి రుతుపవనాలు నై నై అంటున్నాయి జిల్లాలోకి ప్రవేశించినప్పటికీ ఉండి నియోజకవర్గంలో వర్షపు జాడేలేదు. చినుకు పడి కన్పించకుండా పోతుంది. వర్షాలు కురవాల వానదేవుడా అంటూ కప్పల పెళ్లిళ్లు చేయక తప్పదేమో అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పూర్వం వర్షాలు కురవకపోతే కప్పల్ని పీటలపై ఎక్కించి పెళ్లి చేసి, పసుపు కుంకుమ జల్లి ఊరూరా తిప్పి పూజలు చేయడం ఆనవాయితీ. ఆ ఆనవాయితీని కొనసాగించాల్సి వస్తుందేమోనని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గత 15 రోజులుగా ఒక్క సెంటీ మీటర్ వర్షపాతం నమోదు కాలేదు. రోహిణీ కార్తె వెళ్లిపోయి, మృగశిర కార్తె వచ్చినప్పటికీ ఆ జాడే కన్పించడం లేదు. ఆకాశం మేఘావృత్తమై, చల్ల గాలి వీచేసరికి ప్రాణం లెగిసి వస్తున్నట్లుగా ఊపిరి పీల్చుకుంటున్నారు. కొద్ది నిమిషాల్లోనే మేఘాలు, గాలులు కన్పించకుండా పోయి, మళ్లీ ఉక్కబెట్టే వాతావరణంలో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆదివారం ఎండ తీవ్రతతో, వేడి గాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం అయ్యేసరికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడుతూ ఆకాశం మేఘావృతమయ్యింది. చల్లటి గాలులు వీచాయి. గాలులతో పాటు మేఘాలు కూడా కదిలి వెళ్లిపోయాయి. వర్షం వస్తుందని ఆశ పడ్డ జనం మళ్లీ భంగపడ్డారు. వర్షం ఎప్పుడు కురుస్తుందోనని ఎదురు చూస్తున్నారు.

డిగ్రీ కోర్సులపై అవగాహన సదస్సు

భీమవరం : బీవీ.రాజు డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం డిగ్రీ ఆనర్స్ కోర్సుల (బీఎస్సీ, బీకాం, బీసీఏ)పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐఆర్.కృష్ణంరాజు తెలిపారు. ఈ సదస్సులో డిగ్రీ కోర్సుల ప్రాముఖ్యత, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకు అందుబాటులో ఉండే ఉద్యోగ అవకాశాలను వివరిస్తామన్నారు. ప్రముఖ సంస్థల్లో పీజీ కోర్సులు, పోటీ పరీక్షల శిక్షణ అవకాశాలు తెలియజేస్తామన్నారు. ఈ సదస్సును విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉప్పటేరులో పూడిక తొలగించండి

ముంపునకు గురవుతోన్న కొల్లేరు తీర గ్రామాలు



ఉప్పటేరుపై ఆకివీడు వద్ద రెండో రైలు వంతెన ఖానాల వద్ద పేరుకుపోయిన మట్టి

ఆకివీడు: రైల్వే డబ్లింగ్ లైన్‌నిర్మాణంలో భాగంగా ఉప్పుటేరుపై రెండో వంతెన నిర్మాణ సమయంలో ఏర్పడిన మట్టిని తొలగించకపోవడంతో కొల్లేరు తీర గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లేరు నుంచి అదనపు నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే ఉప్పుటేరు 20 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 10 నుంచి 12 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తోంది. డ్రెయినేజీ శాఖ నిర్లక్ష్యంతో ఉప్పుటేరు సామర్థ్యాన్ని కోల్పోతుంది. వీటికి కారణాలు సుమారు 7 సంవత్సరాల క్రితం రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా వంతెన నిర్మాణం చేపట్టారు. నిర్మాణ సమయంలో అవసరమైన పిల్లర్లు ఉప్పుటేరులో నిర్మించేందుకు మట్టితో మార్గం ఏర్పరుచుకున్నారు. సుమారు 200 అడుగుల లోతులో నిర్మించిన పిల్లర్లతో వచ్చిన మట్టిని, మార్గం కోసం ఏర్పాటు చేసిన మట్టిని ఉప్పుటేరులోనే వదిలేశారు. వీటికి తోడు రెండో వంతెన నిర్మాణంలో డ్రెయినేజీ శాఖ అనుమతి లేకుండా భారీ బండ్‌లు నిర్మించారు. దీంతో ఉప్పుటేరు గుండా నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి గోదావరి, కృష్ణా అదనపు జలాలు పంట, మురుగు కాల్వల ద్వారా ఉప్పుటేరులోకి చొచ్చుకు వస్తున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే చినుకు పడితే ఉప్పుటేరులోకి అదనపు నీరు ప్రవేశిస్తుంది. ఈ పరిస్థితుల్లో రైలు వంతెనల మధ్యలో ఏర్పడిన పూడికలు నీటి ప్రవాహానికి తీవ్ర ఇబ్బంది కల్గిస్తున్నాయని కొల్లేరు తీర గ్రామాల ప్రజలు డ్రెయినేజీ శాఖకు, రైల్వే అధికారులకు గతంలో అనేక సార్లు ఫిర్యాదులు చేశారు. దీనిపై రైతులు ఆందోళన చేపట్టినా సంబంధిత రైల్వే కాంట్రాక్టర్ ఉప్పుటేరులో రైలు వంతెనల వద్ద పూడికల్ని తొలగించలేదని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంత ఎంపీలు స్పందించి రైల్వే అధికారులతో మాట్లాడి, సంబంధిత కాంట్రాక్టర్ వెంటనే పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్‌హెచ్ వంతెన నిర్మాణంలోనూ

జాతీయ రహదారి నెం.165 విస్తరణలో బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఉప్పుటేరుపై వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. సంబంధిత కాంట్రాక్టర్ ఉప్పుటేరులో మట్టి పూడ్చి సుమారు 48 పిల్లర్లు నిర్మించి, ఆరు బండ్‌లు నిర్మించేందుకు పనులు మొదలు పెట్టి అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఉప్పుటేరు సగానికి పైగా మట్టితో పూడుకుపోయింది. పనులు పునః ప్రారంభిచకపోవడంతో ఈ ఏడాది పనులు చేసే అవకాశాలు కన్పించడం లేదు. దీంతో పూడికలతో ఉప్పుటేరులో నీటి ప్రవాహం మరింత మందగించే అవకాశం ఉందని రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు ఉప్పుటేరులో ఏళ్ల తరబడి పూడికలు తీయకపోవడంతో సుమారు 150 అడుగుల లోతు ఉండే ఉప్పుటేరు 70, 80 అడుగులకు పూడుకుపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెడల్పులో కూడా చాలా చోట్ల ఉప్పుటేరు కుచించుకుపోయింది.